సాక్షి
నిర్మల్
మంగళవారం । 12 । నవంబర్ । 2024

గరిష్టం/కనిష్టం
32.0 /18.1

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. అల్పపీడనం కారణంగా చలి ప్రభావం తగ్గుతుంది.



నేత్రపర్వం.. గోదావరి హారతి
బాసరలో సోమవారం గోదావరి హారతి నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి హారతిని దర్శించుకున్నారు. నదిలో కార్తిక దీపాలు వదిలారు. 8లో▸

న్యూస్‌రీల్

జాతీయ కబడ్డీ జట్టుకు ఎంపిక



విద్యార్థి ఆశిష్‌తో హెచ్‌ఎం, పీడీ

లక్ష్మణచాంద: జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు లక్ష్మణచాంద ప్రభుత్వ పాఠశాల విద్యార్థి రాథోడ్ ఆశిష్ ఎంపికయ్యాడు. ఇటీవల యాదాద్రి భువనగిరి జిల్లాలో జరిగిన అండర్ -14 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో జాతీయస్థాయి అండర్ 14 కబడ్డీ జట్టుకు ఎంపిక చేశారని ప్రధానోపాధ్యాయుడు రాజునాయక్, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. రాథోడ్ ఆశిష్‌ను పాఠశాలలో సోమవారం అభినందించారు.

బ్యాడ్మింటన్ ఓపెన్ చాంపియన్‌షిప్



విజేతగా నిలిచిన మొదటి నాలుగు టీం లు

నిర్మల్‌టౌన్: నిర్మల్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కొండాపూర్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 9, 10 తేదీల్లో రాష్ట్ర స్థాయి ఓపెన్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ నిర్వహించారు. ఇందులో వివిధ జిల్లాల నుంచి 80 టీమ్స్ పాల్గొన్నాయి. మొదటి స్థానంలో హైదరాబాద్ అకాడమీ, రెండోస్థానంలో నిర్మల్ క్లబ్ నిలిచాయి. వీరికి దాతలు డాక్టర్ మనోజ్ భరత్, ప్రదీప్‌రాజ్ మొదటి బహుమతిగా రూ.20 వేలు, రెండో బహుమతిగా రూ.15 వేలు అందజేశారు. కార్యక్రమంలో నిర్మల్ స్పోర్ట్స్ అకాడమీ సభ్యులు కిశోర్‌కుమార్, సందీప్, ప్రణీత్, వివేక్, ఫణీంద్ర, ప్లేయర్స్ వన్నెల భూమన్న, ప్రశాంత్, రమణ, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

'కొయ్యబొమ్మల' వద్ద ఓటరు సెల్ఫీపాయింట్



ఏర్పాటు చేసిన సెల్ఫీపాయింట్

నిర్మల్: ఓటరు నమోదుపై అవగాహన కల్పించడంతోపాటు నిర్మల్ కొయ్యబొమ్మలకు ప్రచారం కల్పించాలన్న ఉద్దేశంతో సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్)లో భాగంగా కృషిచేస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జి, డీఆర్డీవో విజయలక్ష్మి తెలిపారు. ఓటరు నమోదు ప్రచారంలో భాగంగా స్థానిక కొయ్యబొమ్మల కేంద్రం వద్ద సోమవారం ఓటరు నమోదు సెల్ఫీపాయింట్‌ను ఏర్పాటు చేయించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ స్వీప్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఈద్‌గాంలో కొయ్యబొమ్మల పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. అర్హులైన వారందరూ ఓటు నమోదు చేయించుకోవాలని, అలాగే కొయ్యబొమ్మలను ప్రోత్సహించాలని ఆమె కోరారు.

ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌లో చేప పిల్లల విడుదల



చేపపిల్లలను వదులుతున్న హన్మంత్‌రావు

సోన్: సోన్ మండలం వెల్మల్ వద్ద శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో సోమవారం చేప పిల్లలను విడుదల చేసినట్లు మత్స్యశాఖ డీడీ హన్మంత్‌రావు తెలిపారు. మత్స్యకారుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలు పంపిణీ చేస్తోందని పేర్కొన్నారు. ప్రాజెక్టులో 80–100 మీ.మీ పొడవు ఉన్న సుమారు 9.58 లక్షల కట్ల, రవు, మీర్గా రకాల చేప పిల్లలను పోసినట్లు వివరించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులు, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

స్వాతిప్రియ.. శవమై..

- ట్రిపుల్ ఐటీలో పీయూసీ 2 విద్యార్థిని ఆత్మహత్య
- వ్యక్తిగత కారణాలతోనే అని అధికారుల ప్రకటన
- తమ కూతురును చంపేశారని తల్లి ఆరోపణ
- మృతదేహం తరలింపుపై అనుమానాలు
- సెల్‌ఫోన్, సూసైడ్ నోట్ ఇవ్వడం లేదని ఆగ్రహం
- క్యాంపస్‌ను ముట్టడించిన ఏబీవీపీ నాయకులు
- లాఠీచార్జి చేసిన పోలీసులు, సెక్యూరిటీ గార్డులు



బాసర ట్రిపుల్‌ఐటీ ప్రధాన ద్వారం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు రవీందర్, ఉజ్వల



ట్రిపుల్‌ఐటీ వద్ద పోలీసులు, సెక్యూరిటీగార్డులు

భైంసా/బాసర: బాసరలోని ట్రిపుల్‌ఐటీలో మరో విద్యా సుమం రాలిపోయింది. పీయూసీ2 చదువుతున్న పూరి స్వాతిప్రియ(18) ఆదివారం అర్ధరాత్రి హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం పెర్కిట్‌లోని తిరుమలకాలనీకి చెందిన పూరి స్వాతిప్రియ బాసర ట్రిపుల్‌ఐటీలో పీయూసీ2 చదువుతోంది. విద్యార్థిని మృతి విషయం తెలుసుకున్న కుటుంబీకులు ట్రిపుల్ ఐటీకి చేరుకున్నారు. వారిని సెక్యూరిటీ అధికారులు ప్రధాన గేటు వద్దనే నిలిపివేశారు. పుట్టెడు దుఃఖంతో వచ్చిన తల్లిదండ్రులు గంటలపాటు నిరీక్షించాల్సి వచ్చింది. బంధువుల ప్రశ్నలకు అధికారులెవరూ సమాధానం చెప్పలేదు.

తల్లి ఆరోపణలు...
పూరి స్వాతిప్రియను క్యాంపస్ అధికారులే హత్యచేసి ఆత్మహత్యగా చెబుతున్నారని మృతురాలి తల్లి ఉజ్వల ఆరోపించారు. తాము రాకముందే మృతదేహాన్ని ఆస్పత్రికి ఎందుకు తరలించారని ప్రశ్నించారు. ట్రిపుల్‌ఐటీకి చేరుకున్న తమను లోపలికి ఎందుకు అనుమతించలేదని నిలదీశారు. కూతురు సెల్‌ఫోన్ ఇవ్వడం లేదని, సూసైడ్ నోట్ ఉందని చెప్పిన అధికారులు దానిని చూపించలేదని పేర్కొన్నారు. తమ కూతురు ఆత్మహత్య చేసుకునే అవకాశమేలేదన్నారు. ఆదివారం ఫోన్‌లో మాట్లాడిందని ఉదయానికే ఎలా చనిపోయిందని ప్రశ్నించారు. క్యాంపస్ అధికారులు సాక్ష్యాలు మాయంచేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు. చదువు కోసం పంపితే శవాన్ని ఇంటికి పంపుతున్నారని విలపించారు.

పిల్లలను చదివిస్తూ...
నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం పెర్కిట్‌కు చెందిన పూరి రవీందర్ – ఉజ్వల దంపతులకు ముగ్గురు సంతానం. పెద్ద కూతురు సరస్వతి బీటెక్ చదువుతోంది. రెండో కూతురు స్వాతిప్రియ బాసర ట్రిపుల్‌ఐటీలో చదువుతోంది. కొడుకు ఓంసాయిరాం హైస్కూల్ చదువుతున్నాడు. ఆర్మూర్ మోడల్ స్కూల్‌లో పదో తరగతి వరకు చదివిన స్వాతిప్రియకు బాసర ట్రిపుల్‌ఐటీలో సీటు వచ్చింది. పూరి రవీందర్ ప్రైవేటు ఆసుపత్రులకు ఆక్సిజన్ సిలిండర్లను సరఫరాచేస్తు కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పిల్లలను బాగా చదివిస్తే జీవితంలో స్థిరపడతారని ఎంతో కష్టపడుతున్నారు. కూతురు మృతిచెందడాన్ని కుటుంబీకులు జీర్ణించుకోలేకపోతున్నారు.



స్వాతిప్రియ(ఫైల్)

తల్లిదండ్రులు రాకముందే తరలింపు..
స్వాతిప్రియ దసరా, దీపావళి పర్వదినాల్లోనూ ఇంటికి వెళ్లివచ్చింది. రోజూ తల్లిదండ్రులకు ఫోన్‌లో మాట్లాడేది. సోమవారం ఉదయం క్యాంపస్ అధికారులు ఫోన్ చేసి స్వాతిప్రియ ఆత్మహత్యచేసుకుందని తెలుపడంతో తల్లిదండ్రులు షాక్ అయ్యారు. దీంతో గంటలోపే బాసరకు చేరుకున్నారు. అయితే తల్లిదండ్రులు రాకముందే మృతదేహాన్ని క్యాంపస్ నుంచి భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. దీనిపై వారు అనుమానం వ్యక్తం చేశారు.

పత్తి కొనుగోళ్ల నిలిపివేతపై రైతుల ఆగ్రహం

- రాస్తారోకో, భారీగా నిలిచిన వాహనాలు



మార్కెటింగ్ ఏడీని నిలదీస్తున్న రైతులు

భైంసాటౌన్: పత్తి కొనుగోళ్ల నిలిపివేతపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. భైంసా పట్టణంలోని పార్డి(బి) బైపాస్ వద్ద భైంసా–నిర్మల్ రహదారిపై సోమవారం బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. రైతులకు సమాచారం లేకుండా పత్తి కొనుగోళ్లు నిలిపేయడంపై మండిపడ్డారు. దీంతో గంటపాటు వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఏఎంసీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్, ఏడీఎం శ్రీనివాస్ అక్కడికి చేరుకుని రైతులను సముదాయించారు. సీసీఐ నిబంధనల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా జిన్నింగ్‌మిల్లుల్లో సోమవారం పత్తి కొనుగోళ్లు నిలిచాయని తెలిపారు. ఈ విషయమై తమకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని, విషయం తెలియక వాహనాల్లో పత్తి తీసుకువచ్చి ఇబ్బంది పడ్డామని రైతులు అసహనం వ్యక్తం చేశారు. అనంతరం అధికారులు సముదాయించడంతో ఆందోళన విరమించారు. మధ్యాహ్నం తర్వాత పత్తి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి.



రైతులను సముదాయిస్తున్న ఏఎంసీ చైర్మన్

జిల్లాలోనే బెబ్బులి

- తోడు కోసం జిల్లాల అన్వేషణ..
- ఆదివారం రాత్రి మహబూబా ఘాట్స్‌పై రోడ్డు దాటిన పెద్దపులి
- మామడ మండలం తాండ్ర–గాయిద్‌పల్లి అటవీ ప్రాంతంలో సంచారం

సారంగపూర్: మహారాష్ట్ర నుంచి గత నెల 25న ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోకి వచ్చిన పెద్ద పులి.. తాజాగా సహ్యాద్రి పర్వతశ్రేణిపై కనిపించింది. ఆదివారం రాత్రి సహ్యాద్రి పర్వతాలపై సారంగపూర్ మండలం చించోలి(బి) సమీపంలోని మహబూబా ఘాట్స్‌పై నుంచి రోడ్డు దాటింది. వాహనదారులు గమనించి సెల్‌ఫోన్లలో ఫొటోలు, వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. దాదాపు 20 రోజులు ఎవరి కంట పడకుండా తిరిగిన బెబ్బులి ఇప్పుడు ప్రజల కంట పడడంతో అటవీశాఖ అధికారులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని పులి సంరక్షణ చర్యలు చేపట్టారు. సోమవారం సైతం పులి అన్వేషణ కొనసాగిస్తూనే సమీప గ్రామాలైన అర్కాయితండా, సోనాపూర్, గోపాల్‌పేట్ తండాల ప్రజలను అప్రమత్తం చేశారు.

ఆడ పులి కోసం..
సాధారణంగా అక్టోబర్–జనవరి నెలల మధ్య మగ పులి ఆడపులికోసం అన్వేషణ సాగిస్తాయని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లాలో సంచరిస్తున్న పెద్దపులి మగదని, దాని వయసు 6 నుంచి 8 ఏళ్లు ఉంటుదని తెలిపారు. తోడు కోసం జిల్లా అడవుల్లో సంచరిస్తోందని భావిస్తున్నారు. మహారాష్ట్రలోని తడోబా అడవుల్లో పులుల సంఖ్య పెరగడంతో జిల్లా అడవుల్లో అనువైన వాతావరణం ఉంటే స్థిర ఆవాసం ఏర్పాటు చేసుకునే అవకాశం కూడా ఉందని పేర్కొన్నారు.



ఆదివారం రాత్రి రోడ్డుదాటుతున్న పులి



అర్కాయితండాలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

మామడ అటవీ ప్రాంతంలోకి..
పెద్దపులి మహబూబా ఘాట్స్ మీదుగా రోడ్డు దాటి మామడ మండలంలోని తాండ్ర– గాయిద్‌పల్లి గ్రామాల్లోని అటవీ ప్రాంతంలోకి ప్రవేశించినట్లు అధికారులు నిర్ధారించారు. అయితే తాండ్ర గ్రామ సమీపంలోని ఎన్‌హెచ్–44 దాటకుండా నేరుగా వెళ్తే నేరడిగొండ రేంజ్‌లోని ఆరేపల్లి, వాంకిడి, గ్రామాల్లోని అటవీ ప్రాంతాల్లో ప్రవేశించే అవకాశాలున్నాయని అటవీ అధికారులు తెలిపారు. లేదంటే హైవేను దాటితే రాసిమెట్ల, గాయిద్‌పల్లి, మీదుగా మామడ, దిమ్మదుర్తి నుంచి ఖానాపూర్ డివిజన్‌లోకి ప్రవేశించి అటు నుంచి కవ్వాల్ అభయారణ్యంలో ప్రవేశించే అవకాశం ఉందని భావిస్తున్నారు.



పులి ఆనవాళ్ల కోసం గాలిస్తున్న అటవీ అధికారులు

తాండ్ర–గాయిద్‌పల్లి అడవిలో..
మహబూబా ఘాట్స్ వద్ద రోడ్డు దాటిన పెద్దపులి మామడ మండలంలోని తాండ్ర–గాయిద్‌పల్లి గ్రామాల మధ్య అటవీ ప్రాంతంలో ప్రవేశించింది. ఈ ప్రాంతంలో తాగునీరు లభించే అవకాశం ఉన్నందున పులి ఇక్కడే విశ్రాంతి తీసుకునే అవకాశం ఉంది. పెద్దపులి సంరక్షణ కోసం అన్వేషణ కొనసాగుతుంది. ప్రజలను సైతం అప్రమత్తం చేస్తూ గాలింపు చేపడుతున్నాం.
– నజీర్‌ఖాన్, డీఆర్‌వో, సారంగాపూర్

పత్తి కొనుగోళ్లు సజావుగా నిర్వహించాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: పత్తి కొనుగోళ్లు సజావుగా జరిగేలా చూడాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పత్తి కొనుగోళ్లపై అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్‌తో కలిసి వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఇప్పటి వరకు జిల్లాలో కొనుగోలు చేసిన పత్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పత్తి అమ్మిన తర్వాత నిర్దేశించిన గడువులోపు రైతుల ఖాతాల్లో డబ్బులు జమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పత్తిలో తేమ శాతంపై వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించి అధిక లాభాలు పొందేలా చర్యలు చేపట్టాలన్నారు. రోజువారీగా సేకరించిన పత్తికి సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. పత్తి పంటను విక్రయించడానికి వచ్చే రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మార్కెట్ యార్డులలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. సమావేశంలో మార్కెటింగ్ ఏడీ శ్రీనివాస్, డీఏవో అంజిప్రసాద్, మార్కెటింగ్ కార్యదర్శులు అజాం అలీ, దుండా నాయక్, పుడ్యా నాయక్, గంగన్న, చంద్రశేఖర్ నాయక్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

తప్పులు లేకుండా సర్వే చేపట్టాలి
నిర్మల్‌చైన్‌గేట్: ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన సర్వేను తప్పులు లేకుండా నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే తీరుపై ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, సూపరవైజర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు సర్వే చేసిన ఇళ్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన బ్లాక్‌లలో పూర్తిస్థాయిలో కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేయాలని, సర్వే ముందు రోజు ఏ ప్రాంతంలో సర్వే నిర్వహిస్తున్నారో సంబంధిత కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. జిల్లాలో 2,31,286 కుటుంబాలకుగాను ఇప్పటి వరకు 33,590 కుటుంబాల సర్వే పూర్తి అయ్యిందని తెలిపారు. సర్వేలోని 20 శాతం వివరాలను ర్యాండంగా పరిశీలించాలని సూపర్‌వైజర్లను ఆదేశించారు. సీపీవో జీవరత్నం, నిర్మల్, భైంసా ఆర్డీవోలు రత్నకళ్యాణి, కోమల్‌రెడ్డి, జెడ్పీ సీఈవో గోవింద్, డీఆర్డీవో విజయలక్ష్మి, మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

రిటైర్ అయినా.. అందని బెనిఫిట్స్!

- 65 ఏళ్లు నిండినవారిని తప్పించిన ప్రభుత్వం
- నాలుగు నెలలుగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల ఎదురుచూపు

ప్రాజెక్టుల వారీగా రిటైర్ అయినవారు..

ప్రాజెక్టు	టీచర్లు	హెల్పర్లు
భైంసా	11	14
నిర్మల్	9	36
ముథోల్	7	25
ఖానాపూర్	0	21

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్రంలో 65 ఏళ్లు పైబడిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను ప్రభుత్వం విధుల నుంచి తప్పించింది. వారికి రిటైర్మెంట్ ప్రకటించింది. ఉద్యోగాల నుంచి రిటైర్ అయి నాలుగు నెలలు గడిచాయి. ఇప్పటికీ ఉద్యోగ విరమణ ప్రయోజనాలు అందలేదు. అటు వేతనం లేక.. ఇటు బెనిఫిట్స్ రాక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మనోవేదనలో టీచర్లు, ఆయాలు..
ఏ ఉద్యోగికైనా విరమణ తర్వాత ఎంతో కొంత డబ్బులొస్తే వృద్ధాప్యంలో ఆసరాగా ఉంటుంది. నెలవారీగా పింఛన్ అందితే మరింత భరోసాగా కాలం వెళ్లదీయవచ్చు. కానీ, చిన్నారులతో అక్షరాలు దిద్దించిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు ప్రభుత్వం రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వడంలేదు. దీంతో ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం అంగీకరించిన విధంగా తమకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని, సంబంధిత శాఖ మంత్రిని కలిసి పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఫలితంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా పరిధిలో 926 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. 65 ఏళ్లు దాటడంతో రిటైర్ అయిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు 123 మంది ఉన్నారు.



నిరసన దీక్షలో అంగన్‌వాడీలు, ఆయాలు (ఫైల్)

విధుల్లో నాలుగు దశాబ్దాలు..
అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు కొందరు నాలుగు దశాబ్దాలపాటు సేవలు అందించారు. 1985లో విధుల్లో చేరినవారు ఈ ఏడాది జూన్‌లో ఉద్యోగ విరమణ చేశారు. నాలుగు దశాబ్దాల కాలంలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడంతోపాటు వివిధ రకాల సర్వేలను చేపట్టారు. ఓటరు నమోదు ప్రక్రియలో బీఎల్‌వోలుగా పనిచేయడం, పల్స్‌పోలియో కార్యక్రమాన్ని సక్సెస్ చేయడంలో కీలక పాత్ర పోషించారు. అయితే రిటైర్ అయిన తర్వాత బెనిఫిట్స్ విషయంలో ప్రభుత్వం నాన్చుడు ధోరణిని అవలంబిస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అంగీకరించినట్లుగా టీచర్లకు రూ.2 లక్షలు, ఆయాలకు రూ.లక్ష బెనిఫిట్ అందించాలని కోరుతున్నారు.

జూలై 1 నుంచి విధులు బంద్..
జిల్లా పరిధిలో సుమారు 123 మంది అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు 65 ఏళ్లు పైబడి ఉండడంతో వారిని జూలై ఒకటో తేదీ నుంచి విధులకు రావొద్దని ప్రభుత్వం ఆదేశించింది. అప్పటి నుంచి వేతనాలు ఇవ్వడం లేదు. అయినా కొందరు తమకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ వచ్చే వరకు పనిచేద్దామని ఇంకా కొనసాగుతున్నారు. 1985లో విధుల్లో చేరిన అంగన్‌వాడీ టీచర్లకు అప్పుడు వేతనం నెలకు రూ.200, ఆయాలకు రూ.90 ఇచ్చారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లకు రూ.13,650, ఆయాలకు రూ.9 వేలకు పెంచింది. తమను రిటైర్ కావాల్సిందిగా సూచించిన ప్రభుత్వం బెనిఫిట్స్ విషయంలో ఇప్పటికీ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించడంతోపాటు నెలకు రూ.6 వేల పింఛన్ ఇవ్వాలని కోరుతున్నారు.

బెనిఫిట్స్‌తోపాటు పెన్షన్ ఇవ్వాలి..



రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందజేయాలి. 45 ఏళ్ల జీతం సరిపోకున్నా పిల్లల ఆలనాపాలన చూస్తూ గడిపాము. ఏళ్ల తరబడి పని చేసినందుకు ప్రభుత్వం ఆదుకోవాలి. జీతంలో సగం పెన్షన్ ఇవ్వాలి.
– రాజమణి, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు

దేశ విద్యావ్యవస్థకు మార్గదర్శకుడు ఆజాద్

- కలెక్టరేట్‌లో ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి

నిర్మల్‌చైన్‌గేట్: దేశ విద్యావ్యవస్థకు మార్గదర్శకుడు, విద్యా వ్యవస్థను తీర్చిదిద్దిన మహనీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. భారతరత్న, దేశ తొలి విద్యాశాఖ మంత్రి అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఇతర జిల్లా అధికారులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశానికి ఆజాద్ అందించిన సేవలను వక్తలు గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 11 ఏళ్లు విద్యాశాఖ మంత్రిగా ఆజాద్ ఎనలేని సేవలు అందించి, జాతీయ విద్యా విధానం అమలు చేశారన్నారు. రచయితగా, కవిగా, తత్వవేత్తగా, విద్యావేత్తగా, రాజకీయవేత్తగా అనేక సేవలందించిన బహుముఖ ప్రజ్ఞాశాలి అని కీర్తించారు. మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి సందర్భంగా జిల్లాలోని పాఠశాలల్లో వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించడంతోపాటు విజేతలకు బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను మైనార్టీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మోహన్‌సింగ్, సీపీవో జీవరత్నం, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రాంగోపాల్, మెప్మా పీడీ సుభాష్, మైనారిటీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



ఆజాద్‌కు నివాళులర్పిస్తున్న కలెక్టర్, నాయకులు

వైద్య కళాశాలలో పోస్టుల భర్తీ
నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ వైద్య కళాశాలలో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 52 పోస్టులను ఔట్‌సోర్సింగ్ పద్ధతిన భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ఫారంలు nirmal.nic.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని ఈనెల 18 నుంచి 25వ వరకు కళాశాలలో అందజేయాలని తెలిపారు. ల్యాబ్ అటెండెంట్ 15, స్టోర్ కీపర్ 1, డాటా ఎంట్రీ ఆపరేటర్ 2, స్టెనో–1, టైపిస్ట్–1, రికార్డ్ అసిస్టెంట్–1, రికార్డు క్లర్కు–1, రేడియోగ్రఫీ టెక్నీషియన్–3, రేడియోగ్రఫీ టెక్నీషియన్ ఈసీజీ–2, రేడియోగ్రఫీ టెక్నీషియన్ సిటీ స్కాన్–3, అనస్తీసియా టెక్నీషియన్ –4, దోబీ–4, ఎలక్ట్రీషియన్–2, ప్లంబర్–1, డ్రైవర్–1, థియేటర్ అసిస్టెంట్–4, గ్యాస్ ఆపరేటర్ –2 వార్డు అటెండెంట్–4 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు వివరించారు.

క్లుప్తంగా

తాళం వేసిన ఇంట్లో చోరీ

లక్సెట్టిపేట(మంచిర్యాల): మున్సిపాలిటీ పరిధిలోని ఫిర్దోస్‌నగర్ కాలనీలో తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం కాలనీకి చెందిన ఇసాక్ కొద్ది రో జుల క్రితం ఇంటికి తాళం వేసి కాళేశ్వరంలో ని బంధువుల ఇంటికి వెళ్లారు. సోమవారం ఉదయం వచ్చి చూసే సరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా బీ రువాలోని రెండు తులాల బంగారం, రూ. 10 వేల నగదు కనిపించకపోవడంతో పోలీ సులకు సమాచారం అందించినట్లు పేర్కొన్నాడు.

రిమ్స్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి


మృతదేహం

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ ఆస్పత్రిలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఐపీ విభాగం ముందు గల ఆవరణలో 45 ఏళ్ల వయస్సు గల వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు రిమ్స్ సిబ్బంది తెలిపారు. అతని వద్ద ఉన్న పేపర్లలో ఆదిలాబాద్‌కు చెందిన నీలయ్యగా రాసి ఉన్నట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీలో భద్రపరిచామని, సంబంధీకులు ఎవరైనా ఉంటే తీసుకెళ్లాలని సిబ్బంది కోరారు.

గంజాయి విక్రేత అరెస్ట్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని హమాలీవాడ శివారు ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న ఒకరిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ గురువయ్య తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సోమవారం తనిఖీలు నిర్వహిస్తుండగా విజయనగర్ కాలనీ బోర్డు వద్ద అనుమానాస్పదంగా కనిపించిన అదే ప్రాంతానికి చెందిన షేక్ హుస్సేన్ వద్ద 115 గ్రాముల గంజాయి ప్యాకెట్లు లభించాయి. నార్కోటిక్ డ్రగ్స్ యాక్ట్ 1985 ప్రకారం నిందితునిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ తనిఖీల్లో స్థానిక సీఐ ప్రమోద్‌రావు, ఎక్సైజ్ ఎస్సైలు శంకర్, సిబ్బంది లచ్చన్న, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

కొండచిలువ హల్‌చల్


పట్టుకున్న కొండచిలువ

నెన్నెల(బెల్లంపల్లి): మండల కేంద్రంలోని గోలం లక్ష్మికి చెందిన పెరట్లో సోమవారం 10 అడుగుల కొండచిలువ కనిపించడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. అటవీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో బెల్లంపల్లికి చెందిన స్నేక్ క్యాచర్ దినేష్‌ను పిలిపించారు. అతను కొండచిలువను పట్టుకొని జోగాపూర్ అటవీ ప్రాంతంలో వదిలిపెట్టడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. నెల రోజుల క్రితం డీజే మల్లేశ్ ఇంటి ఆవరణలో రెండు కొండచిలువలు కోళ్లను మింగి యజమాని చేతిలో హతమయ్యాయి. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో భారీ కొండచిలువ ఇనుప కంచెలో చిక్కుకుని గాయాలపాలైంది. ఇళ్ల పరిసర ప్రాంతాల్లో కొండచిలువలు సంచరిస్తుండటంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు.

నేత్రపర్వం.. గోదావరి హారతి

గోదావరికి హారతి ఇస్తున్న వేద పాఠశాల విద్యార్థులు



హారతి కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



మహిళలు వెలిగించిన కార్తిక దీపాలు



కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసరలో శ్రీవేద భారతి పాఠశాల వ్యవస్థాపకులు శ్రీవేద విద్యానందగిరిస్వామి ఆధ్వర్యంలో సోమవారం గోదావరి హారతి నిర్వహించారు. పుష్కర్ ఘాట్ వద్ద ముందుగా శివలింగాలకు ఋషి కుమారులతో అభిషేకం, అర్చన పూజలు జరిపించారు. అనంతరం చతుర్దశ భువన విశేష గంగా హారతి ఇచ్చారు. అనంతరం రుద్ర హోమం, రుద్రాభిషేకం, ఆకాశ దీపం, దీపోత్సవం, శివ పార్వతి కల్యాణం నిర్వహించి అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించారు. సరస్వతీదేవి ఆలయంలో ప్రదోషకాల నిత్య దీపోత్సవం నిర్వహించారు.

– బాసర (ముధోల్)

శారీరక దృఢత్వానికి క్రీడలు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

• ఎమ్మెల్యే రామారావు పటేల్

ముధోల్: క్రీడలు శారీరక దృఢత్వానికి, మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన జోనల్‌స్థాయి క్రీడాపోటీలను ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అండర్ 14, 17, 19 జోనల్ స్థాయి పోటీలు ముధోల్ నిర్వహించడం అభినందనీయమన్నారు. పోటీలకు ఆదిలాబాద్, నిర్మల్, కామారెడ్డి, నిజామాబాద్, జగిత్యాల జిల్లాల నుంచి క్రీడాకారులు తరలివచ్చినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి మాట్లాడుతూ నాలుగు రోజులపాటు నిర్వహించనున్న పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాసర జోనల్ అధికారి పీఆర్ ఫ్లోరెన్స్ రాణి, డీసీవో ప్రశాంతి, గురుకుల ప్రిన్సిపాల్ చల్ల నరసింహారెడ్డి, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ నిరంజన్ పాల్గొన్నారు.

జోనల్‌స్థాయి వాలీబాల్ పోటీలు


పోటీలు ప్రారంభిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాస్

దండేపల్లి(మంచిర్యాల): పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అండర్ 14 సంవత్సరాలలోపు బాలబాలికలకు దండేపల్లి మండలంలోని తాళ్లపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం జోనల్‌స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్ క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. పోటీల్లో ఆదిలాబాద్ జట్టు ప్రథమ స్థానంలో, మంచిర్యాల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. పోటీల్లో ప్రతిభ కనబరిచిన 12 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. కార్యక్రమ నిర్వహణకు తాళ్లపేట వర్తక సంఘం అధ్యక్షుడు రమణయ్య, నాయకపోడ్ సేవాసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మార్నేని భూమేష్ సహకరించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఫణిరాజ, వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు

• ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా


అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జైనూర్ మండలం పానపటార్ గ్రామానికి చెందిన సునీత కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇప్పించాలని, నార్నూర్ మండలం భీంపూర్ గ్రామానికి చెందిన భీంరావు సీఆర్టీ ఉద్యోగం ఇప్పించాలని, ఇంద్రవెల్లి మండలం వడ్గాం గ్రామానికి చెంది రాంశావ్ ఎడ్ల జత మంజూరు చేయించాలని కోరారు. ఇంకా పింఛన్, డబుల్ బెడ్రూం, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయం, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో వసంత్ రావు, ఏవో దామోదర్, పీవీటీజీ ఏపీవో మెస్రం మనోహర్, పీహెచ్‌వో సందీప్‌కుమార్, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

చెన్నూర్: మండలంలో రెండు రోజుల క్రితం జరిగిన హత్య కేసులో సోమవారం నిందితుడిని అరెస్టు చేసినట్లు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. చెన్నూర్ మండలంలోని ముత్తరావుపల్లికి చెందిన జాడి భూమయ్య భార్య సౌందర్యను పైడిపల్లి మల్లయ్య కుమారుడు రాజశేఖర్ ఏడునెలల క్రితం ఇంటి నుంచి తీసుకెళ్లాడు. దీంతో భూమయ్య రాజశేఖర్, సౌందర్యను హతమార్చాలని నిర్ణయించుకుని హైదరాబాద్‌లో గాలించగా ఆచూకీ లభించలేదు. దీంతో ముత్తరావుపల్లికి తిరిగి వచ్చాడు. కుటుంబ సభ్యుల్లో ఎవరినైనా హత్యచేస్తే తిరిగొస్తారని గ్రహించి ఈ నెల 9న తెల్లవారు జామున రాజశేఖర్ తండ్రి పైడిపల్లి మల్లయ్య కెనాల్ వద్దకు బహిర్భూమికి వెళ్లగా విషయం తెలుసుకున్న భూమయ్య అతన్ని వెంబడించి కొడవలితో దాడిచేసి హతమార్చాడు. నిందితుడు పారిపోయి చెన్నూర్‌లో తలదాచుకున్నాడు. సోమవారం మంచిర్యాలకు వెళ్లేందుకు కిష్టంపేట జాతీయ రహదారిపై నడుచుకుంటూ వస్తుండగా పోలీసులు అరెస్టు చేశారు. నిందితుని వద్ద హత్యకు ఉపయోగించిన కొడవలి, నేరం జరిగిన సమయంలో వేసుకున్న దుస్తులను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. రెండు రోజుల్లో హత్య కేసు ఛేదించిన సీఐ రవీందర్, ఎస్సై సుబ్బారావు, కానిస్టేబుళ్లు టీకయ్య, భూమన్న, రాజశేఖర్, హోంగార్డు ఖాదిర్‌ను అభినందించారు.

క్రీడాకారులు గెలుపు కోసం కృషి చేయాలి

లక్సెట్టిపేట(మంచిర్యాల): క్రీడాకారులు పోటీల్లో గెలుపుకోసం కృషి చేయాలని గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కొట్నాక తిరుపతి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో జోనల్ స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలన్నారు. పోటీల్లో కాళేశ్వరం జోన్ పరిధిలోని 15 కళాశాలల నుండి 1,275 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, ఆయా పాఠశాలల పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.



పోటీలు ప్రారంభిస్తున్న గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కొట్నాక తిరుపతి

కాసిపేట గనిలో కార్మికుడికి గాయాలు

కాసిపేట(బెల్లంపల్లి): మందమర్రి ఏరియాలోని కాసిపేట గనిలో సాతుకు కిషోర్‌కుమార్ అనే జనరల్ మజ్దూర్ కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. సోమవారం ఇంజినీరింగ్ డిపార్టుమెంట్ టెండల్ బృందంతో పనికి వెళ్లిన కార్మికుడు ఉదయం షిఫ్టులో గనిలో 4సీం 11డిస్ట్రిక్ట్, 15డిప్ 30 లెవెల్‌లో కిందపడడంతో గాయాలయ్యాయి. పంపు లాగే ట్రాలి వస్తుందా అని చూసేందుకు వెళ్లిన కిషోర్ ఎంతసేపటికీ తిరిగిరాకపోవడంతో మిగతా కార్మికులు వెళ్లి చూసేసరికి కదలలేని స్థితిలో పడి ఉన్నాడు. భారీ యంత్రాన్ని లేపుతున్న క్రమంలో స్లిప్ కావడంతో గాయాలై ఉంటాయని కార్మికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సదరు కార్మికుడిని బీజోన్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి రెఫర్ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఘటనపై గని మేనేజర్ భూశంకరయ్యను వివరణ కోరగా మిగతా కార్మికులను విచారిస్తున్నామన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థితో అధ్యాపకులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల విద్యార్థి జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఏ.అంజయ్య తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బెల్లంపల్లి సింగరేణి తిలక్‌స్టేడియంలో ఈ నెల 9,10 తేదీల్లో అండర్–19 విభాగంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కె.ప్రభాస్ ద్వితీయ స్థానంలో నిలిచి జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. ప్రిన్సిపాల్, అధ్యాపకులు విద్యార్థిని అభినందించారు.

జోనల్ క్రీడలు


మార్చ్‌ఫాస్ట్‌లో నిర్మల్ జిల్లా లెఫ్ట్‌పోచంపాడ్ క్రీడాకారులు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల 10వ జోనల్ క్రీ డా పోటీలు సోమవారం నిజామాబాద్ జిల్లా మో పాల్ మండలంలోని కంజర్ గురుకుల బాలికల పాఠశాల ఆవరణలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలు ప్రారంభించారు. రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడాకారులతో కలిసి క్రీడాజ్యోతిని వెలిగించారు. జాతీయ, సొసైటీ, స్పోర్ట్స్ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన స్వాగతోత్సవ నృత్యాలు, మార్చ్‌ఫాస్ట్ అందరినీ అలరించాయి.

నాలుగు జిల్లాల నుంచి క్రీడాకారులు

నిజామాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, జగిత్యాల జిల్లాల నుంచి 10వ జోనల్ స్పోర్ట్స్ మీట్‌లో 1200 మంది విద్యార్థినులు అండర్ 14, 17, 19 విభాగాల్లో పాల్గొననున్నారు. 14 గురుకులాల నుంచి 9 రకాల క్రీడాపోటీలు నిర్వహించనున్నారు.

ఉపాధ్యాయునికి కాళోజీ పురస్కారం


పురస్కారం అందుకుంటున్న అంజయ్య

మామడ(నిర్మల్):మండలంలోని కొరిటికల్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు దాసండ్ల అంజయ్యకు కాళోజీ జాతీయ స్థాయి పురస్కారం లభించింది. ఈ నెల 9న హైదరాబాద్‌లోని రవీంద్రభారతీలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, భారత్ కల్చరల్ అకాడమీ సంయుక్తంగా నిర్వహించిన జాతీయ కవి సమ్మేళనంలో అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు నాగబాల సురేష్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. సదరు ఉపాధ్యాయుడిని సోమవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణారెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

స్కోచ్ అవార్డు ఫైనల్‌కు నిర్మల్


ఆన్‌లైన్‌లో పాల్గొన్న డీఆర్డీవో విజయలక్ష్మి

నిర్మల్:వర్షపునీటిని ఒడిసి పట్టేందుకు జిల్లా అధికారులు చేసిన కృషికి జాతీయస్థాయిలో గుర్తింపు దక్కుతోంది. ఒకేరోజు వేలాదిగా రూఫ్‌టాప్ రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్(వాననీటి ఇంకుడు గుంతల) నిర్మాణాలను చేపట్టడంపై ప్రతిష్టాత్మక 'స్కోచ్' అవార్డు పరిశీలనలోకి తీసుకుంది. ఈమేరకు దేశవ్యాప్తంగా వందల్లో వచ్చిన నామినేషన్లలో నుంచి ఫైనల్ జాబితాకు ఎన్నికైన 17 నామినేషన్లలో జిల్లా కూడా ఉందని డీఆర్డీవో విజయలక్ష్మి తెలిపారు.

నీటిబొట్టును ఒడిసి పట్టేందుకు..

ప్రతీ వాననీటి బొట్టును కూడా ఒడిసిపట్టాలన్న ప్రభుత్వాల పిలుపుమేరకు జిల్లా అధికారులు పలు కార్యక్రమాలు చేపడుతూనే ఉన్నారు. ఇందులో భాగంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ(డీఆర్‌డీఏ) ఆధ్వర్యంలో 2023, జులై 31న జిల్లావ్యాప్తంగా ఒకే రోజు 5,940 ఇంకుడుగుంతలు నిర్మించారు. మొత్తం ప్రభుత్వ కార్యాలయాలు, భవనాలన్నింటిలో వీటిని నిర్మింపజేశారు. రికార్డుస్థాయిలో చేపట్టిన ఈ కార్యక్రమం జాతీయస్థాయిలో గుర్తింపు పొందింది. ప్రస్తుతం ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డు చేపట్టిన నామినేషన్లలోనూ జిల్లా ఫైనల్‌కు చేరుకోవడం హర్షనీయమని డీఆర్డీవో విజయలక్ష్మి పేర్కొన్నారు. త్వరలోనే ఫైనల్ ఫలితాన్ని వెల్లడిస్తారని, ఇందులో జిల్లాకు అవార్డు దక్కుతుందన్న ఆశాభావంతో ఉన్నామని తెలిపారు.

ఏఎంవీఐ కొలువు సాధించిన సుందర్


నియామకపత్రం అందుకుంటున్న సుందర్

జైపూర్(చెన్నూర్): సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న సుందర్ అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ కొలువు సాధించాడు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నాడు. ఖమ్మం జిల్లాకు చెందిన తేజావత్ సుందర్ 2016లో ఎన్‌పీసీఐఎల్(న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియ లిమిటెడ్)లో తొలి ఉద్యోగం, 2018లో మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్(అసిస్టెంట్ వర్క్ మేనేజర్), ఎస్టీపీపీలో మూడో ఉద్యోగం చేస్తూనే తాజాగా అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ఉద్యో గం సాధించాడు. ఎస్టీపీపీ అధికారులు, ఉద్యోగులు ఆయనను ప్రత్యేకంగా అభినందించారు.

కడుపునొప్పి భరించలేక విద్యార్థి ఆత్మహత్య

జైపూర్(చెన్నూర్): ఉరేసుకుని విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకున్నట్లు ఎస్సై శ్రీధర్ సోమవారం తెలిపారు. కరీంనగర్ జిల్లా వీణవంక మండలం జంగంపల్లికి చెందిన ఎల్కపల్లి రాజేందర్ జైపూర్ పవర్ ప్లాంటులో పనిచేస్తూ స్థానికంగా నివాసం ఉంటున్నాడు. అతని భార్య నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. అతనికి కుమారుడు మనోజ్‌కుమార్ (16), కుమార్తె అంజలి సంతానం. కుమారుడు తరచూ కడుపునొప్పితో బాధపడుతూ ఉండేవాడు. ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరు..

లోకేశ్వరం(ముధోల్): మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఏఎస్సై దిగంబర్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని గొడిసెరా గ్రామానికి చెందిన కసిరే బీరన్న(34) కొంతకాలంగా ఎలాంటి పనిచేయకుండా ఖా ళీగా తిరుగుతున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిసయ్యాడు. సోమవారం సాయంత్రం అతి గా మద్యం సేవించి ఇంట్లో ఎవరూ లేని సమయంలో గొర్రెల కొట్టంలో ఉరేసుకున్నాడు. మృతునికి భార్య గంగామణి, కుమారుడు భర త్, కుమార్తె మనస్వీ ఉన్నారు. కుటుంబ సభ్యు ల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి యువకుడు ..

చింతలమానెపల్లి(సిర్పూర్): పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకున్నట్లు ఎస్సై ఇస్లావత్ నరేష్ తెలిపారు. మండలంలోని గూడెం గ్రామానికి చెందిన బుజాడి తిరుపతి (25)ఆదివారం రాత్రి ఇంట్లో వ్యవసాయ పనులకు వినియోగిస్తున్న పురుగుల మందు తాగడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబసభ్యులు మహారాష్ట్రలోని అహేరి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. మహారాష్ట్రలో మృతి చెందడంతో అక్కడి పోలీసులు కేసు నమోదు చేసినట్లు చింతలమానెపల్లి ఎస్సై తెలిపారు.

కలెక్టరేట్‌లో పొర్లుదండాలు


పొర్లుదండాలు పెడుతున్న సాయికిరణ్

నిర్మల్‌చైన్‌గేట్: తనకు రావాల్సిన ఆస్తిని సోదరులు కాజేయాలని చూస్తున్నాడని, తనకు న్యాయం చేయాలని ఆర్డీవో కార్యాలయం ఎదుట 28 రోజులు దీక్ష చేసిన నిర్మల్‌కు చెందిన చందుల సాయికిరణ్ సోమవారం నిర్మల్ కలెక్టరేట్‌కు వచ్చాడు. ప్రజావాణిలో సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని భావించాడు. కానీ ప్రజావాణి లేకపోవడంతో కలెక్టరేట్ ప్రాంగణంలో పొర్లుదండాలు పెట్టి నిరసన తెలిపాడు. తన గోడును ఏ అధికారీ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. అనంతరం అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. తన ఇద్దరు సోదరులు తన తండ్రితో కలిసి తనకు రావాల్సిన వాటా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. అనంతరం ఆర్డీవో కార్యాలయం వద్దకు వెళ్లి దీక్ష కొనసాగించాడు.

మద్యం మత్తులో యువకుల వీరంగం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని లక్ష్మీ థియేటర్ సమీపంలో ఓ ఫైనాన్స్ వ్యాపారిపై కొందరు వ్యక్తులు మద్యం మత్తులో దాడికి పాల్పడిన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీరాంపూర్‌లోని క్రిష్ణ కాలనీకి చెందిన నగమోతు రమేశ్‌కు మరికొందరు వ్యక్తులకు బైక్ ఫైనాన్స్ విషయంలో వాగ్వాదం జరిగింది. సదరు యువకులు రమేశ్‌పై విచక్షణ రహితంగా దాడిచేసి గాయపరిచారు. స్థానికులు 100కు సమాచారం అందించడంతో పెట్రోకార్ విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ అన్వర్, కానిస్టేబుల్ తిరుపతి ఘటన స్థలానికి చేరుకునే లోపు సదరు వ్యక్తులు అక్కడి నుంచి పారిపోయారు. బాధితుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సీఐ ప్రమోద్‌రావును వివరణ కోరగా గొడవ జరిగింది వాస్తవమేనన్నారు. రమేశ్ మద్యం సేవించి ఉన్నాడని, వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించగా సమాచారం ఇవ్వలేదన్నారు. ఘటనపై ఫిర్యాదు అందలేదన్నారు.


గాయపడిన రమేశ్